


# కరపత్రం

SINCE 2014

గురువారం సెప్టెంబర్ 10,2026 సంపుటి : 2 సంచిక : 330 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

## స్పీకర్‌పై దూషణ ఘటనపై
# సమగ్ర విచారణ

### అంటరానితనం ఘటనలపైనా దర్యాప్తు: సీఎం రేవంత్

- కుల వివక్ష, అణచివేతను ఉపేక్షించం
- సెప్టెంబర్ 6 నుంచి జరిగిన ఘటనలపై విచారణ
- దళితులను అవమానిస్తే కఠిన చర్యలు
- జేసీ విజయ్‌కుమార్‌కు విచారణ బాధ్యతలు
- కుట్రదారులు, అమలు చేసిన వారిపైనా కేసులు
- అసెంబ్లీ వద్ద మహిళల ఘటనపైనా విచారణ



**హైదరాబాద్:** దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఘోరమైన పదంతో దూషించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని.. కానీ తల్లిని అవమానిస్తారా? అని ప్రశ్నించారు. కుల వివక్ష, అణచివేతను తమ ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. స్పీకర్‌పై దూషణ, ఎర్రవల్లిలో దళితులు నడిచారని రోడ్డును శుద్ధి చేసిన ఘటనలపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని తీవ్రంగా పరిగణిస్తున్నామని.. అంటరానితనం సహా సెప్టెంబర్ 6 నుంచి జరిగిన వరుస ఘటనలపై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడారు.

“కసబ్ వంటి ఉగ్రవాదులకు, స్పీకర్‌ను తిట్టిన వారికి తేడా లేదు. స్పీకర్‌కు క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయి. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయి. స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ దళితులు డప్పులతో నిరసన తెలిపారు. ఎక్కడ కుట్ర జరిగిందో.. అక్కడ డప్పు మోగించి వాళ్లు నిరసన చేపట్టారు. ఫాంహౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప.. ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదు. దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని మాత్రమే వారు కోరారు. కేసీఆర్ క్షమాపణ చెప్పకుండా మరో కుట్రకు ఆదేశించారు. సంధ్యారావు అనే నాయకురాలికి చెప్పి ఆ ప్రదేశాన్ని శుద్ధి చేయించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే శుద్ధి చేశామని సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేశారు. పదేళ్లు సీఎంగా ఉన్న.. విజ్ఞత కలిగిన నాయకుడు ఇలా చేస్తారా? శుద్ధి చేయాల్సింది నేలను కాదు.. తరతరాలుగా వాళ్ల మనసుల్లో ఉన్న కుళ్లు, అంతరాలను శుద్ధి చేయాలి. దళితులు నడిచారని నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలి. దళితులను అవమానించిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షిస్తాం. సెప్టెంబర్ 6న ఫాంహౌస్‌లో భేటీ మొదలుకొని ఆ తర్వాత జరిగిన వరుస ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తాం. అంటరానితనం ప్రదర్శించిన వారిపై చర్యలకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. ఈ ఘటనలపై విచారణకు విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నాం. అసెంబ్లీ వద్ద మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపైనా విచారణ చేపడతాం. విధుల్లో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉంటూ సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా సమగ్ర విచారణ చేపట్టి క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. రాజకీయాలకు అతీతంగా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరముంది” అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## బీఆర్ఎస్ అహంకార వైఖరిపై గవర్నర్‌కు మంత్రుల ఫిర్యాదు

- దళితుల పట్ల బీఆర్ఎస్ వివక్ష: మంత్రులు
- స్పీకర్‌ను దూషించడంపై గవర్నర్‌కు ఫిర్యాదు
- ఎర్రవల్లిలో శుద్ధీకరణ ఘటనపైనా ఫిర్యాదు
- స్పీకర్‌పై వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీ ఖండన
- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దురుసు ప్రవర్తనపై చర్చ
- న్యాయ సలహా తీసుకుని చర్యలు: ఎథిక్స్ కమిటీ




2లో

**హైదరాబాద్:** దళితుల పట్ల బీఆర్ఎస్ పార్టీ అహంకారంతో వ్యవహరిస్తోందని తెలంగాణ మంత్రులు ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీతక్క, అజారుద్దీన్, వివేక్, వాకిటి శ్రీహరి తదితరులు గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిశారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను దూషించారని, ఎర్రవల్లిలో దళితులు నిరసన తెలిపిన ప్రదేశంలో శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టారని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు.



2లో

## దళితులు నడిచారని రోడ్డును శుద్ధి చేయడం దారుణం: మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్:** దళితులు నడిచారని రోడ్డును శుద్ధి చేయడం దారుణమైన ఘటన అని తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. అస్పృశ్యత విధానం ఇంకా కొనసాగుతుండటం బాధాకరమని చెప్పారు.

## కేసీఆర్‌కు చెడు జరగాలని
# కాంగ్రెస్ కోరుకోదు



- కేసీఆర్ ఆరోగ్యంపై రాజకీయాలు వద్దు
- ప్రతిపక్ష నేతలను గౌరవించే సంస్కృతి కాంగ్రెస్‌ది
- కేసీఆర్ గాయపడినప్పుడు రేవంత్ స్వయంగా పరామర్శించారు
- కేసీఆర్ ఆరోగ్యంపై నిందలు సరికాదు: మహేష్ గౌడ్
- బీఆర్ఎస్ ఇంటి గొడవలకు కాంగ్రెస్‌ను బాధ్యులను చేయొద్దు
- కేసీఆర్ నూరేళ్లు బతకాలని కోరుకుంటాం
- రాజకీయాల్లో మానవతా విలువలు ఉండాలి

2లో..

## మాపై దాడులు చేసి..
# మాపైనే కేసులు



2లో

- గవర్నర్‌కు పోలీసుల దాడుల ఆధారాలు: కేటీఆర్
- రాష్ట్ర పరిస్థితులపై గవర్నర్‌కు ఫిర్యాదు
- ఎమ్మెల్యేలపై పోలీసుల దాడుల ఆధారాలు సమర్పణ
- సబితపై దాడి, అవమానంపైనా ఫిర్యాదు
- పోలీసులపై ఫిర్యాదు చేసినా కేసు నమోదు కాలేదు
- వెయ్యి రోజుల పాలనలో హామీలు అమలు కాలేదు
- రైతులకు యూరియా కూడా ఇవ్వడం లేదు: కేటీఆర్

## 22ఏపై చర్చ ఎప్పుడు?



2లో

- చర్చ జరిగే వరకు మా ఆందోళన కొనసాగుతుంది: మహేశ్వర్‌రెడ్డి
- సభలో లేని సభ్యుల సస్పెన్షన్ బాధాకరం
- ఏ నిబంధనల ప్రకారం సస్పెండ్ చేశారో చెప్పాలి
- బీఏసీ నిర్ణయాల ప్రకారమే సభ నడపాలి
- ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఏపై చర్చించాలి
- బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్ పునఃసమీక్షించాలి: కూనంనేని

## కుళ్లిన మాంసం.. పాడైన కేకులు.. ఏం జరుగుతోంది?

**హైదరాబాద్:** నగరంలో అంతటా రెస్టారెంట్లు, దాబాలు, హోటళ్లలో టీజీ సేఫ్ బృందం తనిఖీలు చేపట్టింది. కూకట్‌పల్లిలో భూలక్ష్మీ మెస్‌లో కుళ్లిన 30 కేజీల మటన్, 20 కేజీల చికెన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.




2లో..

**ఉప్పల్ పిస్తా హౌస్‌లో..**

కాగా, ఉప్పల్ బ్రాంచ్ పిస్తా హౌస్ కేక్ తిన్న ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. కుళ్లిపోయిన కేక్ అమ్మారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తెలంగాణకు క్లీన్
# ఎయిర్ క్రెడిట్

- టాప్-10 క్లీన్ ఎయిర్ సిటీల్లో నల్లగొండ, సంగారెడ్డి
- సంగారెడ్డికి 8వ స్థానం.. నల్లగొండకు 10వ ర్యాంక్
- గాలి నాణ్యతలో తెలంగాణ నగరాల సత్తా
- కాలుష్య నియంత్రణలో రాష్ట్రానికి అరుదైన గుర్తింపు
- వ్యర్థాల నిర్వహణ, రోడ్ల పరిశుభ్రతకు ప్రాధాన్యం
- క్లీన్ ఎయిర్ సర్వేలో తెలంగాణకు ప్రశంసలు




2లో..

## తెలుగు రాష్ట్రాల్లో రైల్వే లైన్లకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

దేశవ్యాప్తంగా పలు రైల్వే కారిడార్లలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం 8 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు ఖ రాబోతున్నాయి. ఈ మేరకు క్యాబినెట్ నిర్ణయాలు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.



మిగతాది 2లో

## 5 రాష్ట్రాల ఎన్నికల వేళ.. భాజపాకు రూ.1,473 కోట్లు

ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ అత్యధిక నిధులు పొందిన పార్టీల్లో భాజపా అగ్రస్థానంలో నిలిచింది. ఏప్రిల్‌లో పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి శాసన సభలకు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఆ సమయంలో భాజపాకు భారీగా నిధులు అందినట్లు ఎన్నికల సంఘానికి సమర్పించిన వ్యయ నివేదికలో వెల్లడైంది. దీని ప్రకారం.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒక్క భాజపా కేంద్ర కార్యాలయానికి రూ.1,473 కోట్ల మేర నిధులు రాగా.. కాంగ్రెస్ పార్టీ కేంద్ర, రాష్ట్ర విభాగాల నుంచి వచ్చిన మొత్తం రూ.207కోట్లుగా ఉంది. కాంగ్రెస్‌తో పోలిస్తే భాజపాకు వచ్చిన నిధులు ఏడు రెట్లు అధికం.




2లో..

# కేసీఆర్‌కు చెడు జరగాలని కాంగ్రెస్ కోరుకోదు: మహేష్ కుమార్ గౌడ్

మొదటి పేజీ తరువాయి
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై వస్తున్న రాజకీయ విమర్శలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్‌కు చెడు జరగాలని కాంగ్రెస్ ఎప్పుడూ కోరుకోలేదని.. ఇకపై కూడా కోరుకోదని స్పష్టం చేశారు. కేసీఆర్ ఆరోగ్యం పాడవ్వాలని ఎవరు కోరుకుంటున్నారని, ఆయన ద్వారా ఎవరు లబ్ధి పొందాలని చూస్తున్నారని ప్రశ్నించారు.
బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ విషయంలో జరుగుతున్న రాజకీయ విమర్శల నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ మరణాన్ని కాంగ్రెస్ కోరుకుంటోందన్న ప్రచారాన్ని ఖండించారు. ప్రతిపక్ష నాయకులను కూడా గౌరవించే సంస్కృతి కాంగ్రెస్‌దని స్పష్టం చేశారు. కేసీఆర్‌కు చెడు జరగాలని కాంగ్రెస్ కోరుకోవడం లేదని మరోసారి తేల్చిచెప్పారు.
కేసీఆర్ గాయపడిన సమయంలో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అధికారులను అప్రమత్తం చేసి కేసీఆర్‌కు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశించారని, ఆయన ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని కూడా సూచించారని తెలిపారు. అలాంటి తమ పార్టీపై కేసీఆర్ ఆరోగ్యం విషయంలో నిందలు వేయడం సరికాదన్నారు. వారి ఇంటి గొడవలను కాంగ్రెస్‌కు ఆపాదిస్తున్నారు అంటూ విమర్శలు చేశారు. అలాగే, ప్రతిపక్ష నాయకుడు నూరేళ్లు బతకాలని కోరుకుంటాం. కేసీఆర్ విషయంలో మా ఎమ్మెల్యే బాధతో మాట్లాడారు. మా పార్టీ షాద్‌నగర్ ఎమ్మెల్యే సీఎం రేవంత్ రెడ్డి అభిమాని. అందుకే రేవంత్ రెడ్డిని తిడుతుంటే బాధతో కేసీఆర్‌పై అలా మాట్లాడారు. స్పీకర్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు చాలా దారుణం' అని వ్యాఖ్యలు చేశారు.
కాంగ్రెస్ సంస్కృతికి వాజ్‌పేయి, జైపాల్ రెడ్డి ఉదాహరణలు. వాజ్‌పేయి ఆరోగ్యం బాగోలేకపోతే అమెరికాకు పంపించి చికిత్స చేయించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. జైపాల్ రెడ్డికి బైపాస్ సర్జరీ చేయించిన ఘనత కాంగ్రెస్ పార్టీది. రాజీవ్ గాంధీ హత్య కేసు నిందితులకు క్షమాభిక్ష విషయంలో కాంగ్రెస్ కుటుంబం మానవతా దృక్పథాన్ని చూపింది. ఇలాంటి రాజకీయ సంస్కృతి మంచిది కాదు. దళితులకు అత్యున్నత పదవులు ఇచ్చి గౌరవించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది' అని అన్నారు.

# 'మీ మామ రాజకీయ సన్యాసం చేస్తేనే.. నువ్వు మళ్లీ పార్టీలోకి': మాయావతి



బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి. తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను ఇటీవల పార్టీ నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే. పార్టీ ప్రయోజనాలను పరిరక్షించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో ఆమె చెప్పారు. అయితే, ఆకాశ్ చేసిన తప్పులను క్షమించి, మళ్లీ పార్టీలో పనిచేసే అవకాశం కల్పించాలనుకుంటున్నట్లు మాయావతి తాజాగా వెల్లడించారు. అయితే, అందుకు ఓ షరతు విధించారు. ఆకాశ్ ఆనంద్ మామ, మాజీ ఎంపీ అశోక్ సిద్ధార్థ్ రాజకీయ సన్యాసం తీసుకుంటేనే.. తిరిగి తన మేనల్లుడిని పార్టీలోకి ఆహ్వానిస్తానని స్పష్టం చేశారు. అలా జరిగితే బహుజన్ సమాజ్ పార్టీకి సంబంధించిన కీలక బాధ్యతలు కూడా ఆకాశ్‌కు తిరిగి అప్పగిస్తానని మాయావతి పేర్కొన్నారు. అశోక్ సిద్ధార్థ్ పార్టీ లక్ష్యాల కన్నా తన వ్యక్తిగత, కుటుంబ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారని ఆమె ఆరోపించారు. ఈ పర్యవసానాలను ఆయనతో పాటు ఆకాశ్ కూడా భరించాల్సి వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా తన కుటుంబాన్ని.. కుమార్తె-అల్లుడి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అశోక్ రాజకీయాల నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. అప్పుడే తన మేనల్లుడికి బాధ్యతలు అప్పగించే విషయాన్ని పార్టీ పరిశీలిస్తుందని మాయావతి స్పష్టం చేశారు.
బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి గతంలో తన రాజకీయ వారసుడిగా మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను ప్రకటించారు. తర్వాత ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ఆకాశ్ ఇంకా పరిణతి సాధించలేదని అప్పట్లో పేర్కొన్నారు. మళ్లీ గతేడాది ఆయనను తన రాజకీయ వారసుడిగా.. పార్టీ జాతీయ సమన్వయకర్తగా ప్రకటించారు. పార్టీలో పూర్తి పరిణతితో పనిచేసేందుకు ఆకాశ్‌కు మళ్లీ అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇటీవల మరోసారి ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించారు. ప్రస్తుతం మూడోసారి కూడా యూటర్న్ తీసుకొని ఆకాశ్‌కు మరో అవకాశం ఇవ్వనున్నట్లు మాయావతి పేర్కొనడం గమనార్హం.

## 5 రాష్ట్రాల ఎన్నికల వేళ..
## భాజపాకు రూ.1,473 కోట్లు

మొదటి పేజీ తరువాయి
అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి ఎన్నికలకు సంబంధించిన కాంగ్రెస్ సమగ్ర వ్యయ నివేదిక ఇదివరకే వెలువడింది. మార్చి 15నుంచి మే 6వరకు కొనసాగిన ఎన్నికల సమయంలో ఆ పార్టీ రూ. 207.17 కోట్ల ఆదాయాన్ని.. రూ.248.55 కోట్ల వ్యయాన్ని చూపించింది. దీనికి భిన్నంగా అదే సమయంలో భాజపా తన కేంద్ర కార్యాలయం నుంచే రూ. 1,472.8 కోట్లు వచ్చినట్లు నమోదు చేసింది. కేరళ, పశ్చిమ బెంగాల్ ఎన్నికలకు సంబంధించిన ఆ పార్టీ వ్యయ నివేదికలు ఇంకా బహిర్గతం కాలేదు. వాటితో కలిపితే ఆ పార్టీ మొత్తం ఆదాయం ఇంకా అధికంగానే ఉండే అవకాశముంది.

## బీఆర్ఎస్ అహంకారంతో వ్యవహరిస్తోంది: గవర్నర్‌కు మంత్రుల ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి
స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్సీలు తాతా మధు చేసిన వ్యాఖ్యలను శాసన మండలి ఎథిక్స్ కమిటీ ఖండించింది. కమిటీ ఛైర్మన్ మహేశ్ కుమార్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. శాసనసభ స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై సభ్యులు చర్చించారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దురుసు ప్రవర్తనపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ అంశంపై న్యాయ సలహా తీసుకుని ముందుకెళ్లాలని ఎథిక్స్ కమిటీ నిర్ణయించింది.

## టీవీకే అధికార కూటమి కొత్త పేరు ఇదే..



తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ పార్టీ టీవీకే నేతృత్వంలోని అధికార కూటమికి 'సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ ఫ్రంట్'గా నామకరణం చేశారు. టీవీకే మిత్రపక్షాలు బుధవారం చెన్నైలో సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. భేటీ అనంతరం టీఎన్‌సీసీ చీఫ్ మాణికం ఠాగూర్ మాట్లాడుతూ.. టీవీకే అధ్యక్షుడు, సీఎం విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి ఏర్పాటైనట్లు వెల్లడించారు.
ఈ కొత్త పేరు తమ కూటమి ఆశయాలు, అజెండాను స్పష్టంగా తెలియజేస్తోందని మాణికం ఠాగూర్ అన్నారు. రాష్ట్ర హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఇందులో భాగమేనని తెలిపారు. తమ కూటమి ఉప ఎన్నికల్లో పోటీ చేస్తుందని చెప్పారు. తమిళనాడులో కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్, వామపక్షాల మద్దతుతో టీవీకే సర్కారు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

## ఎస్సీలు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేస్తారా?: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ఎస్సీలను భారత రాష్ట్ర సమితి పార్టీ అవమానిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ధ్వజమెత్తారు. తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు మూడో రోజు ప్రారంభమైన వెంటనే.. ఎర్రవల్లిలో శుద్ధిపై కాంగ్రెస్ పార్టీ వాయిదా తీర్మానం ఇచ్చింది. మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎర్రవల్లిలో ఎస్సీలు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేస్తారా? అని ప్రశ్నించారు. శుద్ధి పేరుతో ఎస్సీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆత్మగౌరవం కోసం తెలంగాణ సాధించుకున్నాం.. రాష్ట్రం సాధించుకున్న తర్వాత కూడా ఎస్సీలపై వివక్ష కొనసాగుతోందన్నారు.

## ట్రయల్ రూమ్‌కు టాటా..!



షాపింగ్ మాల్‌కు వెళితే... నచ్చిన దుస్తులు నాలుగైదు ఎంచుకుంటాం. వాటిని ధరించి చూసేందుకు ట్రయల్‌రూం ముందు నిరీక్షిస్తాం.
ఒక్కో డ్రెస్ వేసుకోవడం, తీసేయడం, మరోటి ప్రయత్నించడం... ముఖ్యంగా రద్దీ సమయంలో ఇదంతా కాస్త విసుగ్గానే ఉంటుంది.
ఈ ఇబ్బందులకు చెక్ పెట్టేలా 'ఏఐ వర్చువల్ ట్రయల్' సాంకేతికత అందుబాటులోకి వస్తోంది.
ఇప్పటివరకు అద్దం అంటే మన ప్రతిబింబాన్ని చూపించేదే. కానీ కొత్త తరం స్మార్ట్ మిర్రర్లు మాత్రం అంతకుమించి పనిచేస్తున్నాయి. కెమెరాలు, సెన్సర్లు, కృత్రిమ మేధ సాయంతో వినియోగదారుల శరీర ఆకృతిని గుర్తిస్తాయి. అనంతరం ఎంపిక చేసిన దుస్తులను డిజిటల్‌గా శరీరంపై అమర్చి చూపిస్తాయి. దీంతో ట్రయల్‌రూమ్‌లోకి వెళ్లకుండానే ఆ దుస్తులు వేసుకుంటే ఎలా ఉంటుందో ఓ అంచనాకు రావచ్చు.

సాధారణ అద్దంలా కనిపించే డిజిటల్ డిస్‌ప్లే ముందు నిలబడితే చాలు.. మనకు నచ్చిన డ్రెస్ మనం వేసుకున్నట్లుగా స్క్రీన్‌పై కనిపిస్తుంది. కొత్త టెక్నాలజీలో ఆసక్తికరమైన అంశం 'వర్చువల్ ట్రై ఆన్'. మాల్‌లో నచ్చిన దుస్తుల ఫొటో తీసి సంబంధిత డిజిటల్ స్క్రీన్ లేదా యాప్‌లో ఎంపిక చేస్తే చాలు. ఏఐ దాన్ని వినియోగదారు ధరించినట్లుగా రూపొందిస్తుంది. మన ఫొటో లేదా లైవ్ ఇమేజ్‌ను విశ్లేషించి దుస్తుల డిజైన్, రంగు, ఆకృతిని డిజిటల్‌గా జతచేస్తుంది. ఒక్కో డ్రెస్ నిజంగా వేసుకుని చూడాలంటే సమయం పడుతుంది. కానీ ఈ విధానంలో ఒకేసారి అనేక డిజైన్లు ప్రయత్నించవచ్చు. ఒకే చీరను వేర్వేరు బ్లౌజ్‌లతో.. ఒకే గౌన్‌ను వివిధ రంగుల్లో.. కుర్తీని పలు స్టైళ్లలో చూసే అవకాశం ఉంటుంది.
అయితే ఈ విధానంలో దుస్తుల ఫిట్టింగ్ పూర్తిగా తెలిసిపోదు. వస్త్రం నాణ్యత, ఫ్యాబ్రిక్ స్పర్శ, కచ్చితమైన సైజు వంటి అంశాలు వాటిని ధరించినప్పుడే తెలుస్తాయి.
ఎలా పనిచేస్తుంది..

**కెమెరా ద్వారా వ్యక్తి ముఖ ఆకృతిని గుర్తిస్తుంది.**
ఏఐ, కంప్యూటర్ విజన్‌తో శరీర భాగాలను విశ్లేషిస్తుంది.
ఎంపిక చేసిన దుస్తుల డిజిటల్ నమూనాను రూపొందిస్తుంది.

**దానిని వినియోగదారు ప్రతిరూపంపై అమర్చి చూపిస్తుంది.**
రంగులు, డిజైన్లు మార్చి పోల్చుకునే అవకాశమిస్తుంది.
గూగుల్‌లోనూ..

**'గూగుల్ క్రోం'లో డ్రెస్ వర్చువల్ ట్రై ఆన్ అని టైప్ చేస్తే పేజీ ఓపెన్ అవుతుంది. గూగుల్ షాపింగ్‌పై క్లిక్ చేస్తే మరో పేజీ ఓపెన్ అవుతుంది.**
అందులో మీకు నచ్చిన దుస్తులను ఎంచుకుంటే పక్కన ట్రై ఆన్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి మీ ఫొటోను అప్‌లోడ్‌చేస్తే మీకు సరిపోయే దుస్తులను అచ్చం ధరించినట్టుగానే కనిపిస్తుంది.
దుస్తులకే పరిమితం కాదు..
వర్చువల్ ట్రయల్ టెక్నాలజీ కేవలం దుస్తులకే పరిమితం కావడం లేదు. కళ్లద్దాలు, నగలు, వాచీలు, షూస్, మేకప్, హెయిర్ స్టైల్స్ వరకు విస్తరిస్తోంది. ఇంటి నుంచి షాపింగ్ చేసేవారికీ ఈ సాంకేతికత కొత్త అనుభవాన్ని అందిస్తోంది.

## మాపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి
రాష్ట్రంలో శాంతి భద్రతలు, ఇతర అంశాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. గవర్నర్‌ను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. " రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను గవర్నర్‌కు వివరంగా తెలిపాం. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారు. అన్ని వర్గాలకు డిక్లరేషన్లు, బాండ్ పేపర్లు, అఫిడవిట్ల పేరిట 420 హామీలు ఇచ్చారు. ప్రజలకు హామీలు గుప్పించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేదని గవర్నర్‌కు వివరించాం. రైతుబంధు కింద గతంలో రూ.73వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు కనీసం యూరియా కూడా ఇవ్వట్లేదని తెలిపాం. రైతు బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగులను ఏ విధంగా మోసం చేశారో వివరించాం. పార్లమెంట్‌కు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేం కూడా నల్లరంగు టీషర్టులు వేసుకుని వెళ్లాం. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లాం. ఎమ్మెల్యేలపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం. మాపై దాడులు చేసి... మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు" అని వివరించారు.

## 22ఏపై శాసనసభలో చర్చ ఎప్పుడు?: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి
శాసనసభలో 22ఏపై ఎప్పుడు చర్చ చేపడతారో చెప్పాలని.. అప్పటి వరకూ తమ ఆందోళన కొనసాగుతుందని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. సభలో లేని సభ్యులను స్పీకర్ సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. ఏ నిబంధనల ప్రకారం సస్పెండ్ చేశారని ప్రశ్నించారు. బీఏసీ సమావేశంలో చెప్పిన విధంగా సభ నడపాలన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయని.. వాటిపై చర్చించాలని డిమాండ్ చేశారు.
సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌ను పునఃసమీక్షించాలని, వారు సభకు వచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఏ తదితర అంశాలపై సభలో చర్చించాలన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో రైల్వే లైన్లకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి
ఈ నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల రైల్వే నెట్‌వర్క్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.10,021కోట్లుగా కేంద్రం పేర్కొంది. 2029-30 నాటికి వీటిని పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది. ఈ మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులతో దక్షిణాదిలో 2,121 గ్రామాలకు రైలు మార్గం అందుబాటులోకి రానున్నట్లు తెలిపింది.

- **రూ.2,419 కోట్లతో ఘట్‌కేసర్-కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల పొడవైన నాలుగో లైన్ నిర్మాణం**
- **అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 77 కిలోమీటర్ల పొడవుతో 3,4 లైన్ల నిర్మాణం**
- **వైట్‌ఫీల్డ్-బంగారుపేట మధ్య 47 కిలోమీటర్ల పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణం**
- **159 కిలోమీటర్ల మేర సేలం-కరూర్-దుండిగల్ డబ్లింగ్**
- **147 కిలోమీటర్ల మేర హోసూర్-ఒమలూరు డబ్లింగ్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.**

## కుళ్లిన మాంసం.. పాడైన కేకులు.. ఏం జరుగుతోంది?

మొదటి పేజీ తరువాయి
కేక్ తిన్న కాసేపటికే వాంతులు అయ్యాయన్న బాధితులు.. కేక్ నుంచి దుర్వాసన వచ్చిందని చెబుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.
ఇటీవల అత్తాపూర్‌లోని బార్బిక్యూ నేషన్ రెస్టారెంట్‌లో హెచ్-- ఫాస్ట్, ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీల్లో ఫ్రిజ్‌లో కుళ్లిన మాంసాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే. గడువు ముగిసిన ఐస్‌క్రీమ్‌లు, కుళ్లిపోయిన పండ్లను గుర్తించారు. ఏప్రిల్ నెలలో మంగళ్‌హాట్‌లో కుళ్లిపోయిన మేకలు, గొర్రెల మాంసం విక్రయ గోడౌన్‌పై పోలీసులు దాడులు నిర్వహించగా.. సుమారు వెయ్యి కిలోల మాంసం విడిభాగాలను స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని పలు హోటళ్లకు, రెస్టారెంట్లకు, ఫంక్షన్ హాళ్లలో జరిగే శుభ కార్యాలకు మాంసాన్ని సరఫరా చేస్తున్నాడు. మహారాష్ట్ర, హరియాణా, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాల నుంచి అఫ్రోజ్ నాణ్యత లేని మాంసాన్ని విడిభాగాలను తక్కువ ధరకు దిగుమతి చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు.

## దళితులు నడిచారని రోడ్డును శుద్ధి చేయడం దారుణం: మంత్రి వాకిటి శ్రీహరి

మొదటి పేజీ తరువాయి
శాసనసభలో ఆయన మాట్లాడారు."స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, విద్యతో చైతన్యం పెరిగినా కొందరి భావజాలం మారలేదు. ఇలాంటి అహంకారపూరిత వ్యక్తులు, పార్టీని ప్రజలు సహించరు. భూతల్లిని కాదు.. అస్పృశ్యత నాటుకుపోయినా వాళ్ల మనసులను శుద్ధి చేయాలి. మహిళా ఉద్యోగుల ముందు దుస్తులు విప్పటం చూసి సభ్యసమాజం తలదించుకుంటోంది. కేసీఆర్ సభకు వచ్చి సలహాలు, సూచనలు ఇవ్వాలని సీఎం ఎన్నోసార్లు ఆహ్వానించారు" వాకిటి శ్రీహరి అన్నారు.

## తెలంగాణకు క్లీన్ ఎయిర్ క్రెడిట్

మొదటి పేజీ తరువాయి
**స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ సర్వేల్లో తెలంగాణ నగరాల హవా**
తెలంగాణలోని నల్లగొండ, సంగారెడ్డి సిటీలకు అరుదైన గుర్తింపు లభించింది. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో దేశంలో టాప్ 10 క్లీన్ ఎయిర్ సిటీల్లో నల్లగొండ, సంగారెడ్డిలు నిలిచాయి. 3 లక్షల కంటే తక్కువ జనాభా ఉన్న నగరాల జిబితా( కేటగిరీ3) లో సంగారెడ్డి 8వ స్థానంలో, నల్లగొండ 10వ స్థానంలో నిలిచాయి. దీంతో గాలి నాణ్యత, కాలుష్య నియంత్రణలో తెలంగాణ నగరాల పనితీరుపై ఆసక్తి నెలకొంది.కేటగిరీ3లో ఒడిశాకు చెందిన కళింగనగర్, అంగుల్, తాల్చేర్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఏలూరు, హల్దియా, విజయనగరం, దేవాస్, సంగారెడ్డి, డాష్టల్, నల్లగొండ టాప్-10లో చోటు దక్కించుకున్నాయి.
ఇదిలా ఉంటే .. 10 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల జాబితాలో లక్నో 198 పాయింట్లతో నంబర్ వన్ గా నిలిచింది. 2025లో టాప్‌లో ఉన్న ఇండోర్ ఈసారి 197 పాయింట్లతో రెండో స్థానానికి పరిమితమైంది. జబల్‌పూర్ మూడో స్థానంలో నిలిచింది. సర్వేలో ప్రధానంగాాపీ10 కాలుష్య స్థాయిల తగ్గింపు, వ్యర్థాల నిర్వహణ, రోడ్ల పరిశుభ్రత, కాలుష్య నియంత్రణ చర్యలను పరిగణనలోకి తీసుకున్నారు.

# మోడీని చంపడానికి నిరంతర కుట్రలు

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

- మోడీని అంతమొందించడానికి నిరంతర కుట్రలు జరుగుతున్నాయి
- సెప్టెంబర్ 8న ముంబైలో జరిగిన హత్యా ప్రయత్నం పై దర్యాప్తు సాగుతున్నది

ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ లో ఉన్న 'నీతా ముకేష్ అంబానీ కల్చరల్ సెంటర్' లో సెప్టెంబర్ 8న జరగాల్సిన 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026' ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ హాజరుకావాల్సి ఉంది.

▪ ఈ కార్యక్రమానికి ఒక రోజు ముందు సెప్టెంబర్ 7న ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఆడిటోరియం సమీపంలోని జియో వరల్డ్ ప్లాజా మాల్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు.అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి అనుమానం రావడంతో వారి ఐడీ కార్డులను తనిఖీ చేయగా అవి నకిలీ అని తేలింది.ముందస్తు భద్రతా పర్యవేక్షణ వల్ల కుట్ర బయటపడింది.

ఈ కేసులో ముంబై పోలీసులు ఇద్దరు ప్రధాన నిందితులను అరెస్ట్ చేశారు. ఒకరు రోహన్ ప్రేమల్ పారిఖ్ 24 సంవత్సరాలు, ఈయన తాను ప్రైమ్ మినిస్టర్స్ ఆఫీస్ (PMO) అధికారిగా నకిలీ గుర్తింపు కార్డు...Fake PMO ID Card చూపిస్తూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించాడు.రెండవ వ్యక్తి దిలీప్ రాజా కుండే 49 సంవత్సరాలు. ఈయన రోహన్ పారిఖ్‌కు బాడీగార్డ్‌గా నటిస్తూ లోపలికి ప్రవేశించాడు. ఇతని వద్ద ఒక తుపాకీ, ఫైర్‌ఆర్మ్ లభ్యమైంది. ఆ తుపాకీకి లైసెన్స్ ఉన్నప్పటికీ, హై-సెక్యూరిటీ జోన్‌లోకి అనధికారికంగా ఆయుధంతో ప్రవేశించడం చట్టవిరుద్ధం. వీరితో పాటు ప్రథమేష్ గణేష్ భౌల్ అనే మూడో నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

▪ నిందితులపై ప్రభుత్వ ఉద్యోగిగా నకిలీ అవతారమెత్తడం ... (Impersonation of a public servant) ఆయుధాలతో అక్రమంగా ప్రవేశించడం వంటి తీవ్రమైన సెక్షన్ల కింద బాంద్రా కుర్లా కాంప్లెక్స్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది.

▪ అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితులను కోర్టు సెప్టెంబర్ 11 వరకు పోలీస్ కస్టడీకి అప్పగించింది.ఈ కేసు దర్యాప్తును ముంబై క్రైమ్ బ్రాంచ్ ముమ్మరంగా చేస్తోంది. వారు అసలు ఎందుకు లోపలికి వెళ్లాలనుకున్నారు? వారి వెనుక ఉన్న ఉద్దేశం ఏంటి? అనే కోణంలో నిందితుల మొబైల్ ఫోన్లు, కాల్ రికార్డులను పరిశీలిస్తున్నారు.

▪ ప్రధాని మోదీపై ఎలాంటి దాడి ప్రణాళిక రచించారు అనే విషయం పోలీసులు ధృవీకరించలేదు, అయితే ఈ ఘటన జరిగిన వెంటనే ముంబై వ్యాప్తంగా విమానాశ్రయం మరియు వేదికల వద్ద భద్రతను అత్యంత కఠినతరం చేశారు.

**గతంలో భారత ప్రధాని స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రి ని చంపినట్లు ప్రధాని మోడీని చంపడానికి వరుసగా కుట్రలు జరుగుతున్నాయి.**

ఈశాన్య రాష్ట్రాలను భారతదేశం నుండి వేరు చేసి, అక్కడ ఒక ప్రత్యేక క్రిస్టియన్ దేశాన్ని ఏర్పాటు చేయడానికి అమెరికాకు చెందిన 'డీప్ స్టేట్' చాలా కాలంగా కుట్ర జరుగుతున్నది. 2026 మార్చిలో అమెరికాకు చెందిన మాథ్యూ వాన్‌డైక్ (Matthew VanDyke) అనే ఏజెంట్‌ను, అతనితో పాటు ఉక్రెయిన్‌కు చెందిన మరో ఆరుగురిని భారత భద్రతా దళాలు అరెస్ట్ చేశాయి. ప్రస్తుతం మాథ్యూ వాన్‌డైక్ ఢిల్లీలోని తీహార్ జైల్లో ఉన్నాడు.

▪ భారత్-నేపాల్ సరిహద్దులో ఎటువంటి ప్రయాణ పత్రాలు పాస్‌పోర్ట్, వీసా లేకుండా అనుమానాస్పదంగా తిరుగుతూ అమెరికా మాజీ సైనికుడు జోర్డాన్ బ్రౌన్ ..Jordan Brown పట్టుబడ్డాడు. అతను థాయిలాండ్ నుండి శ్రీలంకకు, అక్కడ నుండి 25 నవంబర్ 2026 న సముద్ర మార్గం ద్వారా అక్రమంగా భారత్ లోకి ప్రవేశించి గోవాలో తల దాచుకొని భారత్ లో పట్టుబడ్డాడు. అతడిని అరెస్టు చేసి జాతీయ భద్రతా సంస్థలు కేసులు పెట్టాయి.




▪ గతంలో చైనాలో జరిగిన ఒక అంతర్జాతీయ సదస్సు సమయంలో ప్రధాని మోదీ భద్రతకు తీవ్ర ముప్పు ఉందని గ్రహించిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి మోదీని తన సొంత క్యావల్‌కేడ్ కార్ లో కూర్చోబెట్టుకుని సురక్షితంగా తరలించారని, ఆ సమయంలో డెత్ థ్రెట్ గురించిన సమాచారాన్ని పంచుకున్నారని విశ్లేషకులు చర్చించారు.

▪ ప్రధాని మోదీకి ప్రాణాపాయం మరియు అత్యంత తీవ్రమైన భద్రతా ముప్పు ఉండటం వల్లే భద్రతా ప్రోటోకాల్స్ ప్రకారం ఆయన మణిపూర్ పర్యటన రద్దు చేయబడింది. కానీ ప్రతిపక్షాలు దీనిని రాజకీయంగా వాడుకుంటున్నాయని రక్షణ రంగ నిపుణులు, ప్రజలు కూడా అభిప్రాయపడ్డారు.

▪ గతంలో పంజాబ్‌లోని ఒక హైవే బ్రిడ్జ్ పైన ప్రధాని కాన్వాయ్‌ను అరగంటకు పైగా నిలిపివేయడం దేశ భద్రతకు జరిగిన పెద్ద భంగపాటని, అది శాటిలైట్ గైడెడ్ దాడులకు దారితీసేంత ప్రమాదకరమైన సిట్యుయేషన్ అని పేర్కొన్నారు.

**భారత్ లో పట్టుబడిన ఇద్దరు అమెరికా ఏజెంట్లను తీసుకెళ్లడానికి అమెరికాకు చెందిన CIA ఉన్నతాధికారులు ప్రత్యేక విమానంలో వచ్చి భారత జాతీయ భద్రతా సలహాదారు (NSA) అజిత్ దోభాల్‌తో చర్చలు జరిపినప్పటికీ, నిందితుల ఎలక్ట్రానిక్ డివైసెస్ మరియు డేటా మొత్తం పూర్తిగా విచారించే వరకు వారికి యాక్సెస్ ఇచ్చేందుకు అంటే వారిని కలవడానికి కూడా భారత ప్రభుత్వం అనుమతి నిరాకరించారు.**

▪ అంతర్గత,అంతర్జాతీయ రక్షణ లో,దౌత్య నీతిలో స్వాభిమానంతో దూసుకెళ్తున్న భారత్ ను నిలువరించడానికి విపరీతమైన కుట్రలు జరుగుతున్నాయి.

ఆత్మనిర్భర భారత్ గా మన దేశం మారకుండా ఇంటా బయట దేశ వ్యతిరేక శక్తులు కృషి చేస్తూనే ఉన్నాయి.

▪ ముంబైలో జరిగిన స్టేడియం మీటింగ్ లలో ప్రధాని భద్రతను క్షుణ్ణంగా పర్యవేక్షిస్తారు. కానీ లక్షలాది మంది పాల్గొని బహిరంగ సభలలో ప్రధాని లాంటి వ్యక్తులను కాపాడడం చాలా కష్టమైన విషయం.

పోలీసులు, రక్షణ బలగాలు అనుక్షణం అప్రమత్తతో మెలగాల్సిన పరిస్థితి నెలకొని ఉన్నది.

**మోడీని ఏదో ఒక రకంగా అంతమందించడానికి ఆహారం నుండి ఆకాశ దాడుల వరకు కుట్రలు జరుగుతున్నాయి.**

▪ నిన్న గాక మొన్న జంతర్ మంతర్ వద్ద జరిగిన హింసాకాండ వెనుక బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకలలో జరిగిన పరిస్థితులను ఇండియాలో కూడా పునరావృతం చేయాలనే అంతర్జాతీయ శక్తుల కుట్ర ఉంది.

అమెరికా నుండి కొందరు సోషల్ మీడియాలో మిలియన్ల కొద్దీ ఫాలోవర్లను సంపాదించి, అందులో పాకిస్తానీయులు, బంగ్లాదేశీయులను చేర్చుకుని హింసకు పాల్పడ్డారు. పోలీసులు అడ్డుకున్నప్పుడు గొడవ పడ్డారు, ఎంతోమంది పోలీసులు గాయపడ్డారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వంటి వారు వారికి మద్దతుగా నిలిచారు.

కొందరు పరిశోధకులు దీని వెనుక అమెరికాకు చెందిన CIA 'ప్రభుత్వ మార్పు'...Regime change కుట్ర ఉందని కూడా అంటున్నారు.

అయితే ఈ సెక్యూరిటీ బ్రీచ్ గురించి ఇప్పుడే ఒక నిర్ధారణకు రావడం తొందరపాటే అవుతుంది.

సెప్టెంబర్ 8 నాటి సంఘటన గురించి ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు జరుగుతున్నది.ఆ నకిలీ పాస్ ఎక్కడి నుండి వచ్చింది, ఆయుధం ఎక్కడిది అనేది విచారణలో త్వరలోనే తెలుతుంది.

**తనకంటూ ఏమీ లేకుండా సర్వ సంఘ పరిత్యాగం చేసి దేశాన్ని నడుపుతున్న ప్రధాని మోడీకి భారత ప్రజల సంపూర్ణ ఆశీర్వాదం ఉంది. సర్వేశ్వరుని ఆశీర్వాదం కూడా ఉంది.**

▪ ఈ ఆశీస్సులే మోడీకి శ్రీరామరక్ష. ప్రజల ఆశీస్సులతో భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలిపేవరకు భారత పయనం ఆగదు.

విదేశీ బానిస మనస్తత్వం తొలగే వరకు, సమసి పోయేవరకు ఈ జన జాగరణ నడుస్తూనే ఉంటుంది. ఈ మహా యజ్ఞంలో మోడీ తో పాటు అశేష జనం కలిసి నడుస్తూనే ఉంటారు.

**భారత్ మాతాకీ జై**

## కుమార్తె ఫొటోలు మార్ఫింగ్ చేసి తల్లికి పంపిన లోన్ యాప్ నిర్వాహకుల దాష్టీకం

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**




కుమార్తె ఫొటోలు మార్ఫింగ్ చేసి తల్లికి పంపారు లోన్ యాప్ నిర్వాహకులు. బోడుప్పల్ రాజలింగం కాలనీకి చెందిన ఓ మహిళ బంధువు కోసం వర్ధన్ యాప్ లో రుణం తీసుకున్నారు. ఈఎంఐ చెల్లించకపోవడంతో యాప్ నిర్వాహకులు ఫోన్ చేసి వేధించారు. ఆమె నంబర్లను బ్లాక్ చేసినా, ఇతర నంబర్ల నుంచి ఫోన్లు చేసి, పదోతరగతి చదువుతున్న కుమార్తె ఫోటోలను మార్ఫింగ్ చేసి వాట్సాప్ లో పంపారు. రుణం చెల్లించకపోతే సోషల్ మీడియాలో పెడతామని బెదిరించారు. దీంతో మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మెట్‌పల్లి పాఠశాలలో ఏకరూప దుస్తుల పంపిణీ




**గాజెంగి మహేశ్వర్ కరపత్రం ప్రతినిధి**

మెట్‌పల్లి చైతన్య నగర్ లోని మండల ప్రాథమిక పాఠశాలలో బుధవారం 16వ వార్డు కౌన్సిలర్ అరిసె వనజ మురళి ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలు ఉన్నత స్థానాలను చేరుకోవాలని, క్రమశిక్షణతో మంచి ర్యాంకులు సాధించాలని ఆమె సూచించారు. ప్రధానోపాధ్యాయులు సుశీల కౌన్సిలర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అరిసె మురళి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తెలంగాణ భాషా వైభవం చాటిన కోరుట్ల కళాశాల

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**



కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను వివరిస్తూ ఒక కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రొండి అర్జున్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సందీప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ భాషకు ప్రత్యేకమైన మాధుర్యం, సాహిత్య వైభవం ఉందని, కాళోజి చేసిన సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు

**గాజెంగి మహేశ్వర్ కరపత్రం ప్రతినిధి**

మేడిపల్లి (పడమర) ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.
ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్యాల పోటీ, వ్యాసరచన, ఉపన్యాస పోటీలతో పాటు తెలుగు ప్రత్యేక క్విజ్ పోటీలను నిర్వహించారు.
విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పద్యాలను శ్రావ్యంగా పాడి వినిపించారు.

అలాగే, తెలుగు ప్రముఖ కవుల చిత్రాలను అద్భుతంగా గీసి ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.



అనంతరం విద్యార్థులు తెలంగాణ భాషా వైశిష్ట్యంపై ఇచ్చిన ఉపన్యాసాలు సభికులను ఎంతగానో రంజింపజేశాయి.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు పండితులు సొప్పరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ భాషా దినోత్సవ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కాళోజీ నారాయణరావు జీవిత విశేషాలను, తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన క్రియాశీలక పాత్రను చక్కగా వివరిస్తూ, ఆయన రాసిన తెలుగు కవితలను పాడి వినిపించారు.
పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.హెచ్. నాగమణి



మరియు ఉపాధ్యాయ బృందం శ్రీదేవి, పద్మలత, నాగన్న, జ్యోతి, భీమన్న, లక్ష్మి, ఉమా గార్లు తెలంగాణ భాషా గొప్పతనాన్ని, సంస్కృతిని కొనియాడారు. విద్యార్థులు మాతృభాషను గౌరవిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.
ఉపాధ్యాయులు, విద్యార్థుల సమన్వయంతో ఈ వేడుకలు అత్యంత విజయవంతంగా ముగిశాయి

## మేడ్చల్ వార్తలు సంక్షిప్తంగా

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

### కూకట్‌పల్లి లో అగ్నిప్రమాదం

మేడ్చల్ జిల్లా పరిధిలోని కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్ పారిశ్రామిక వాడలో ఉన్న ఖాదీజ ప్రింటింగ్ పరిశ్రమలో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతున్నారు.
మేడ్చల్ జిల్లా పరిధిలోని కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్ పారిశ్రామిక వాడలో మంగళవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది.

### చలో హైదరాబాద్ పిలుపు

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు.
ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

### కండ్లకోయలో బీఆర్ఎస్ నిరసన

మేడ్చల్ జిల్లా కండ్లకోయలో అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకుడు వినతిపత్రం అందజేసి ఆందోళన చేపట్టారు.
కండ్లకోయలో అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం అందజేసి, మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరును ఖండించారు.

## నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి

▪ **దాచేపల్లిలో సిపిఐ నాయకులు నిరసన**

**కరపత్రం ప్రతినిది దాచేపల్లి, సెప్టెంబర్ 09 :**
నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని సిపిఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ దాచేపల్లి తహసిల్దార్ కి మెమరాండం ఇవ్వడం జరిగింది. 2014 నుండి 2026 వరకు నిత్యవసర వస్తువులు రేట్లు భారీగా పెరిగాయని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి కానీ శ్రమ చేసుకునే వారి కూలి మాత్రం పెరగడం లేదన్నారు. దీనివల్ల



పేద మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి నిత్యవసర సరుకులు రేట్లు తగ్గించాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ దాచేపల్లి మండల కార్యదర్శి కొమర వెంకటరావు, రేపూరి రామయ్య, ఎన్. కొండలు, తెలనాకుల సత్యనారాయణ, బుర్రి. కృష్ణారెడ్డి, ఆనంద్ కుమార్, ఎం. సర్వయ్య, ఈ. రోశయ్య, పి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
గురువారం సెప్టెంబర్ 10,2026

# కరీంనగర్ లో రాష్ట్రస్థాయి యోగా పోటీలు

- తెలంగాణ యోగ అసోసియేషన్ చైర్మన్ రవీందర్ సింగ్

**కరపత్రం ప్రతినిది కరీంనగర్**

కరీంనగర్లో రాష్ట్రస్థాయి యోగా పోటీలు ఈనెల 11 నుండి నిర్వహించనున్నట్లు తెలంగాణ యోగ అసోసియేషన్ చైర్మన్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ తెలిపారు. ఈ మేరకు కరీంనగర్ లోని తారక హోటల్లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1993లో ఏర్పడిన కరీంనగర్ జిల్లా యోగ అసోసియేషన్ జిల్లాలో యోగా క్రీడాభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి గణనీయంగా సేవలందించినట్టు చెప్పారు. తమ అసోసియేషన్ కృషి ఫలితంగా 2004 నుండి కరీంనగర్ జిల్లా 16 సార్లు రాష్ట్రంలోనే ఓవరాల్ ఛాంపియన్ గా నిలవడం ఇక్కడి క్రీడాకారుల ప్రతిభకు నిదర్శనం అన్నారు. అంతర్జాతీయ స్థాయి యోగా పోటీలలో కరీంనగర్ జిల్లా నుండి ఎన్. సిద్ధారెడ్డి , ఆర్. ప్రణీత, బి.యమున టి మనోజ్ కుమార్ పి దేవయ్య ఎం ఉదయ్ కిరణ్ లు భారతదేశానికి ప్రాతినిథ్యం వహించి పలు పతకాలు సాధించారని చెప్పారు. యోగాలో రాణించిన



క్రీడాకారులు ప్రొఫెషనల్ కోర్సులలో స్పోర్ట్స్ కోటాలో రిజర్వేషన్ ద్వారా లబ్ధి పొందారని తెలిపారు.
ఈనెల 11, 12 తేదీలలో కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికల విభాగంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. వీటిలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి 800 మంది క్రీడాకారులు, 50 మంది కోచ్ లు , మేనేజర్లు, 40 మంది టెక్నికల్ అఫీషియల్స్ హాజరవుతున్నట్లు చెప్పారు సబ్ జూనియర్ విభాగంలో 8-10, 10-12,12-14 జూనియర్ విభాగంలో 14-16 ,16- 18 వయసుల విభాగంలో పోటీలు జరుగుతాయి అన్నారు. బాలికలకు భగత్ నగర్ లోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో, బాలురకు వివేకానంద సీబీఎస్ పాఠశాలలో వసతి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. క్రీడాకారులకు ఉచితంగా భోజనంతోపాటు మెరుగైన సౌకర్యాలు సమకూరుస్తున్నట్లు తెలిపారు. 2017 నుండి 24 వరకు క్రమం తప్పకుండా రాష్ట్రస్థాయి పోటీలకు కరీంనగర్ ఆతిథ్యం ఇచ్చినట్లు చెప్పారు. ఈ పోటీలో రాణించే క్రీడాకారులు రాజస్థాన్ లోని జైపూర్ లో వచ్చేనెల 3 నుండి జరిగే జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అక్కడ రాణించే క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎంపిక అవుతారని చెప్పారు.
ఈనెల 11న ఉదయం 11 గంటలకు జరిగే ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మేడిపల్లి సత్యం, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, వివేకానంద సిబిఎస్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సుధాకర్ రావు, ప్రముఖ ఫిజీషియన్ డా. రఘురామన్, రాష్ట్ర యోగ అసోసియేషన్ అధ్యక్ష , ఎస్ఎన్ రెడ్డి, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు జె. మనోహర్ కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు.
ఈ సమావేశంలో తెలంగాణ యోగ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి రామకృష్ణ కోశాధికారి స్వరూప చారి, కోచులు కిష్టయ్య మల్లేశ్వరి ఆనంద కిషోర్ తదితరులుపాల్గొన్నారు.

# దళితబంధు నిధులపై కౌశిక్‌రెడ్డి దుష్ప్రచారం

- లబ్ధిదారుల ఖాతాల నుంచి ఒక్క రూపాయి కూడా వెనక్కి పోలేదు: వొడితల ప్రణవ్
- ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేసి దళితులకు క్షమాపణ చెప్పాలి
- అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ కౌశిక్‌రెడ్డి

**కరపత్రం ప్రతినిది జమ్మికుంట సెప్టెంబర్ 9**

హుజూరాబాద్: దళితబంధు లబ్ధిదారుల ఖాతాల్లో ఉన్న రూ.50 కోట్ల నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకుందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. దళితబంధు అంశంపై కౌశిక్‌రెడ్డి చేస్తున్న దుష్ప్రచారాన్ని దళిత సమాజం గమనిస్తోందని ఆయన పేర్కొన్నారు.
ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ.. దళితబంధు లబ్ధిదారుల ఖాతాల్లో ఉన్న నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా వెనక్కి తీసుకోలేదని స్పష్టం చేశారు. రూ.50 కోట్ల నిధులను వెనక్కి తీసుకున్నామని కౌశిక్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని సవాల్ విసిరారు. ఆరోపణలను నిరూపించలేకపోతే



పదవికి రాజీనామా చేసి, దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
ఎన్నికల సమయంలో ఓట్ల కోసం దళితులను ఉపయోగించుకోవడం తప్ప, వారి సంక్షేమం కోసం నిజంగా ఆలోచించిన సందర్భం కౌశిక్‌రెడ్డి హయాంలో లేదని ప్రణవ్ విమర్శించారు. ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో దళితబంధు నిధులను ఎందుకు పూర్తి స్థాయిలో విడుదల చేయలేదని ప్రశ్నించారు. దళితుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు కౌశిక్‌రెడ్డికి లేదని అన్నారు.
దళితబంధు విషయంలో గతంలో దళితులను మోసం చేసిన వ్యక్తి ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా మరోసారి రాజకీయ డ్రామాకు తెరలేపుతున్నారని ప్రణవ్ మండిపడ్డారు. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అబద్ధాలు చెప్పడంలో కౌశిక్‌రెడ్డిని మించిన వారు లేరని ఘాటు వ్యాఖ్యలు చేశారు.
దళితబంధు నిధుల విడుదల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తోందని వొడితల ప్రణవ్ తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు నిధులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, త్వరలోనే నిధుల విడుదలకు సంబంధించిన ప్రక్రియ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.
దళితబంధు అంశంపై రాజకీయ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేయకుండా వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన సూచించారు. దళిత సమాజాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మొలుగురి సదయ్య. గూడేపు సారంగపాణి. పరుశు రామారావు. పొనగంటి మల్లయ్య. దేశిని కోటి.సాయిని రవి. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం మున్సిపల్ కౌన్సిలర్లు చంద రాజు. కొలుగూరి నరేష్ .పొనగంటి విష్ణువర్ధన్. దొగ్గల భాస్కర్. పాతకాల అనిల్. రాసపల్లి సాగర్.పర్లపల్లి నాగరాజు . అశోక్ తదితరులు పాల్గొన్నారు

# కృష్ణవేణి ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు..

**కరపత్రం ప్రతినిది గోదావరిఖని సెప్టెంబర్ 09:**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విశేష కృషి చేస్తూ, విద్యారంగంలో అంకితభావంతో సేవలందిస్తున్న కృష్ణవేణి పాఠశాలలు, గోదావరిఖని, ఎన్టిపిసి ఉపాధ్యాయులకు అరుదైన గౌరవం దక్కింది. ట్రస్మా పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లికృష్ణవేణి పాఠశాలలకు చెందిన ఆరుగురు ఉపాధ్యాయులు "ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు" అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్న వారిలో ఎం. రామకృష్ణ, ఎన్.రాజిరెడ్డి, పి.సత్యనారాయణ, సి.హెచ్. శైలజ, కె.మంజుష, పి.రాంబాబు ఉన్నారు. ఈ సందర్భంగా కేటీఎస్ స్కూల్స్, గోదావరిఖని, ఎన్టిపిసి చైర్మన్ పి.శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ శ్రీమతి పి.మంజుల శ్రీనివాస్ రెడ్డి అవార్డు గ్రహీతలను అభినందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత వంటి లక్షణాలను



పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని యాజమాన్యం ప్రశంసించింది. ఉపాధ్యాయుల అంకితభావం, క్రమశిక్షణ, విద్యార్థుల పట్ల బాధ్యతాయుతమైన సేవలకు ఈ పురస్కారాలు గుర్తింపుగా నిలుస్తాయని పేర్కొన్నారు.

**"ఈ గౌరవం మరింత బాధ్యతను పెంచింది"..**

ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి, వారి సేవలను ప్రోత్సహించిన ట్రస్మా పెద్దపల్లి జిల్లా బృందానికి కృష్ణవేణి పాఠశాలల యాజమాన్యం, అవార్డు గ్రహీతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తమపై మరింత బాధ్యతను పెంచిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి భవిష్యత్తును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని అవార్డు గ్రహీతలు తెలిపారు.

**ఉపాధ్యాయుల సేవలకు దక్కిన గౌరవం..**

విద్యార్థుల్లో జ్ఞానం, విలువలు, క్రమశిక్షణను పెంపొందిస్తూ విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు లభించిన ఈ గౌరవం కృష్ణవేణి పాఠశాలల విద్యా ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచిందని యాజమాన్యం పేర్కొంది. ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహం అందించడం ద్వారా మరింత నాణ్యమైన విద్యను అందించేందుకు కృష్ణవేణి పాఠశాలలు ఎల్లప్పుడూ ముందుంటాయని యాజమాన్యం తెలిపింది.

# జమ్మికుంట మార్కెట్ అభివృద్ధికి కీలక నిర్ణయాలు

- ఖరీఫ్ సీజన్‌లో పత్తి, ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు
- కొత్త, పాత మార్కెట్లలో మౌలిక వసతుల అభివృద్ధికి పాలకవర్గం ఆమోదం
- 15 మంది హమాలీలకు ట్రాక్టర్, ట్రాలీ లైసెన్సుల జారీకి నిర్ణయం

**కరపత్రం ప్రతినిది జమ్మికుంట:సెప్టెంబర్ 9**

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో మార్కెట్ యార్డుల అభివృద్ధి, రైతులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు రాబోయే ఖరీఫ్ సీజన్‌లో పంటల కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని మార్కెట్ కమిటీ పాలకవర్గం నిర్ణయించింది. బుధవారం జమ్మికుంట కాటన్ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం అధ్యక్షతన పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు.
సమావేశం ప్రారంభంలో తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం పలు అంశాలపై చర్చించి కీలక తీర్మానాలు చేశారు. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన మార్కెట్ కమిటీ ఆదాయ, వ్యయాలను సమీక్షించారు.
రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని





జమ్మికుంట మార్కెట్ పరిధిలో పత్తి, ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. రైతులకు కనీస మద్దతు ధరకు సంబంధించిన ఏర్పాట్లు, అవసరమైన పరికరాలను ముందస్తుగా సిద్ధం చేయడంపై పాలకవర్గం దృష్టి సారించింది.
అలాగే మార్కెట్‌లో పనిచేసే ట్రాక్టర్, ట్రాలీ హమాలీలకు సంబంధించి 15 మందికి లైసెన్సులు జారీ చేసేందుకు సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపారు.

**▪ మార్కెట్ యార్డుల అభివృద్ధికి ప్రాధాన్యం**

జమ్మికుంట కొత్త, పాత మార్కెట్ యార్డుల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు పలు అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించారు. కొత్త, పాత మార్కెట్లలోని సీసీ ప్లాట్‌ఫారాల మధ్య తారు వేయడం, రెండు మార్కెట్లలోని కాంపౌండ్ వాల్‌ల నిర్వహణ పనులు చేపట్టాలని నిర్ణయించారు.
కొత్త మార్కెట్ యార్డులోని మరుగుదొడ్ల నిర్వహణ, గోడౌన్ల పైకప్పుల మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్త మార్కెట్ కార్యాలయం ముందు సీసీ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయడంపై కూడా చర్చించారు.
పాత మార్కెట్ యార్డులో డ్రైనేజీ ఎత్తును పెంచడం, మార్కెట్ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వంటి అంశాలను కూడా పాలకవర్గం పరిశీలించింది. రైతులు, వ్యాపారులు, హమాలీలు ఇబ్బందులు పడకుండా మార్కెట్ యార్డుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని నిర్ణయించారు.
మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆర్. మల్లేశం, ద్వితీయ శ్రేణి కార్యదర్శి ఎన్. రాజా, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు శ్రీపతి రెడ్డి, సునీల్, సతీష్, రాజేశ్వరరావు, సదానందం, సురేష్, దీక్షిత్, శ్రీనివాస్‌రెడ్డి, రషీద్ పాషా, తిరుపతి, శ్యామ్‌కుమార్, శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందకుంట మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గూడెపు ఓదేలు

- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: గూడెపు ఓదేలు

**కరపత్రం ప్రతినిది ఇల్లందకుంట: సెప్టెంబర్ 9**




కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మల్యాల గ్రామానికి చెందిన గూడెపు ఓదేలు నియమితులయ్యారు. టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది.
హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ గూడెపు ఓదేలుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.
నూతనంగా నియమితులైన గూడెపు ఓదేలు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇల్లందకుంట మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.
అలాగే ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీని మండలంలో మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని గూడెపు ఓదేలు పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

# కోరా హైస్కూల్‌లో మట్టి వినాయకులపై అవగాహన కార్యక్రమం

**కరపత్రం ప్రతినిది కరీంనగర్**




పర్యావరణ పరిరక్షణలో భాగంగా కోరా హైస్కూల్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో చైర్మన్ మహిపాల్ రెడ్డి , డైరెక్టర్లు వరప్రసాద్ , రాంరెడ్డి , సింహాచలం హరికృష్ణ , జెడ్.సి వంగల సంతోష్ రెడ్డి, లయన్ హెచ్. రాజిరెడ్డి , లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320-జి, కరీంనగర్ బాలాజీనగర్ లయన్స్ క్లబ్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణాన్ని, నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడవచ్చని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి కాలుష్యం ఏర్పడి జలచరాలకు హాని కలిగే అవకాశం ఉందని వివరించారు.
ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణహితంగా వినాయక చవితిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఈ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.
"మట్టి వినాయకుడిని పూజిద్దాం -- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో కార్యక్రమం కొనసాగింది.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# "బీటెక్ విద్యార్థి అదృశ్యం.. మిస్సింగ్ కేసు నమోదు

**వర్గల్ సెప్టెంబర్ 09, కరపత్రం ప్రతినిది**



బీటెక్ విద్యార్థి అదృశ్యమైన ఘటన గౌరారం పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది.గౌరారం ఎస్ ఐ ఆరోగ్యం తెలిపిన వివరాల ప్రకారం. గుంటిపల్లి గ్రామానికి చెందిన బొమ్మ సందీప్, తండ్రి కనకయ్య,( 17 ),విద్యార్థి, గౌరారంలోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.రోజువారీగా కాలేజీకి వెళ్లే క్రమంలో మంగళవారం ఉదయం సుమారు 07:00 గంటలకు కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లాడు. అయితే సాయంత్రం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం బంధువులు, స్నేహితులు తెలిసిన ప్రాంతాల్లో వెతికారు. అయినప్పటికీ ఆచూకీ లభించలేదు బుధవారం అతని తండ్రి బొమ్మ కనకయ్య గౌరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి సమాచారం తెలిసినవారు ,ఆరోగ్యం ఎస్సై o91 87126 67340 గౌరారం పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# మృతురాలి అంత్యక్రియలకు రూ.5 వేల ఆర్థిక సాయం

**చిగురుమామిడి, సెప్టెంబర్ 9 కరపత్రం ప్రతినిది**



చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన వంతడుపుల రాజవ్వ (భర్త: రామయ్య) అకాల మరణం పట్ల జేరిపోతుల జయశ్రీ--బాలచందర్ దంపతులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతురాలి అంత్యక్రియలు, దహన సంస్కారాల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని జేరిపోతుల జయశ్రీ--బాలచందర్ తరఫున కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతురాలి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వంతడుపుల దిలీప్ కుమార్, వంతడుపుల రామయ్య, వంతడుపుల తిరుపతి, కొమ్ము కొమురయ్య, వంతడుపుల రాములు, వంతడుపుల దుర్గయ్య, వంతడుపుల వెంకటేశ్, జేరిపోతుల సంజీవ్, మంథని దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.